## క్లుప్తంగా

### జగన్‌కు రాఖీ



కాకినాడ రూరల్: రాఖీ పండగకు ముందే వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీ కట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జగన్‌కు రాఖీ కట్టి ఆశీర్వచనాలు అందజేసినట్టు నాగమణి తెలిపారు. ప్రజాభిమానం గల నేతగా జగనన్న మళ్లీ అధికారంలోకి రావాలని ఆమె ఆకాంక్షించారు.

### వాస్క్యులర్ వ్యాధులకు సకాలంలో వైద్యం

**సర్జన్ డాక్టర్ అమరేంద్రబాబు**

కాకినాడ రూరల్: వాస్క్యులర్ వ్యాధులకు సకాలంలో వైద్యం అందించాలని ప్రముఖ సర్జన్ డాక్టరు ఎస్ఎస్ అమరేంద్రబాబు పేర్కొన్నారు. నేషనల్ వాస్క్యులర్ డేను పురస్కరించుకుని మంగళవారం కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏటా ఆగస్టు 6న నేషనల్ వాస్క్యులర్ డేను నిర్వహిస్తున్నామన్నారు. మోకాళ్లకు పై లేదా కింద భాగం వరకు తొలగించాల్సిన పరిస్థితులు లేకుండా అవగాహనతో సరైన చికిత్సను చేయించుకుని చిరకాలం జీవించాలన్నారు. ఈ వ్యాధులు ముఖ్యంగా అనేక రోగాలు పాదాల్లో గాయాలు, డయాబెటిక్ ఫుట్ అల్సర్స్, గ్యాంగ్రిన్ వంటి సమస్యలతో బాధపడుతున్నారని, వీటిని సమయానికి గుర్తించి తగిన చికిత్సలు చేస్తే అవయవాలు తొలగించే ప్రమాదం ఉండదని తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో అతి తక్కువ ఖర్చుతో ఈ చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ ఆస్పత్రిలో వాస్క్యులర్ స్క్రీనింగ్ క్యాంప్ ద్వారా రోగులకు ఉచిత సలహా, పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

### 'మన మిత్ర'తో ప్రభుత్వ సేవలు



కరపలో మన మిత్ర యాప్ గురించి వివరిస్తున్న ఎంపీడీఓ అనుపమ

కరప: గ్రామ సచివాలయాలకు వెళ్లకుండానే మన మిత్ర యాప్ ద్వారా ఇంటివద్ద నుంచే ప్రభుత్వ సేవలు పొందవచ్చని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. కరపలో మంగళవారం వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర యాప్) గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ పంచాయతీ, సచివాలయాల సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మన మిత్ర యాప్ గురించి వివరించే కరపత్రాలను పంచారు. ఎంపీడీఓ అనుపమ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లలో మన మిత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దానిద్వారా విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించవచ్చో, గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలను ఎలా పొందవచ్చో వివరించి, అవగాహన కల్పించారు.

### వ్యక్తిపై హత్యాయత్నం



తీవ్ర గాయాలతో పడి ఉన్న గంగాధర్

కాకినాడ క్రైం: కాకినాడలో వ్యక్తిగత కారణాలతోతో మంగళవారం రాత్రి ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. వివరాల్లోకి వెళితే, నగరంలో గొల్లపేటకు చెందిన 35 ఏళ్ల మలకల గంగాధర్ స్థానిక సుబ్బయ్య హోటల్ సమీపంలో ఉన్న మద్యం దుకాణం వద్ద మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో మద్యం తాగుతున్నాడు. గతంలో అతడి దాడికి గురైన చీడిలపోరకు చెందిన దారపురెడ్డి వెంకయ్యరెడ్డి, మణి ముందస్తు ప్రణాళికతో అక్కడ కాపుకాసి గంగాధర్‌పై హత్యాయత్నం చేశారు. తీవ్ర గాయాలపాలైన గంగాధర్ వారిని ఎదుర్కొనే క్రమంలో ఎదురు దాడి చేశాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోగా, వెంకయ్యకు గాయాలయ్యాయి. వీరిరువురిని స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గంగాధర్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గంగాధర్ భవన నిర్మాణ కార్మికుడు కాగా అవివాహితుడు, వెంకయ్య రెడ్డి, మణి స్థానికంగా పండ్ల వ్యాపారం చేస్తుంటారని పోలీసులు తెలిపారు.

### 17న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

బోట్‌క్లబ్: సంస్కార భారతి ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 9 గంటలకు స్థానిక విద్యుత్‌నగర్ చల్లా కల్యాణమండపంలో శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి రాజారావు మంగళవారం తెలిపారు. మూడు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. మూడేళ్ల లోపు వారిని సబ్ జూనియర్స్‌గాను, 4 నుంచి ఆరేళ్ల లోపు జూనియర్స్ గాను, 7 నుంచి పదేళ్ల లోపు వారిని సీనియర్స్‌గా పరిగణించి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్స్ ఆహార్యం, నడక, కృష్ణుని శ్లోకం చెప్పాల్సి ఉంటుందన్నారు. పాల్గొనే వారు 94412 38911, 94415 63789 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

# ప్రతిభ చూపితే రూ.పది వేలు!

- ఒక్కొక్క విద్యార్థికి ప్రోత్సాహకం
- పాఠశాల స్థాయిలో పరిశోధనలు
- ఇన్‌స్పైర్ మనక్‌కు సెప్టెంబర్ 15 తుది గడువు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్

బాలాజీచెరువు: ఒక ఐడియా చదువులకు భరోసాగా నిలవనుంది. విద్యార్థి చెప్పిన ఆలోచన నిర్వాహకులకు నచ్చితే రూ.10వేలు బహుమతి ఇస్తారు. ఆ డబ్బులతో తయారు చేసిన సైన్స్ సంబంధిత ప్రాజెక్టుతో సదరు విద్యార్థి జాతీయస్థాయి వరకూ నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చు. విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపికైయితే ప్రభుత్వం తోడ్పాటునందిస్తుంది. ఇంత చక్కని అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలనుకునే విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డ్స్–మనక్‌లో ప్రాజెక్టుల సారాంశాన్ని ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకునేందుకు సెప్టెంబర్ 15 వరకూ గడువు పెంచారు.

**మేధోశక్తికి పదునుపెట్టేలా**

విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాలలో పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు మక్కువ పెంచేలా ప్రభుత్వం ప్రత్యేక తోడ్పాటు అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ పేరిట ఏటా రాష్ట్ర, కేంద్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న మేధోశక్తికి పదును పెట్టేలా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 2025–26కు ఇన్‌స్పైర్ అవార్డ్స్–మనక్ పేరిట సైన్స్ ప్రయోగాలకు విద్యార్థులను సిద్ధం చేస్తూ వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

**ఆలోచన చెబితే చాలు**

సృజనాత్మకత, నూతనత్వంతో కూడిన పర్యావరణ హితమైన, సామాజిక, సమస్యల పరిష్కారం సూచించేలా విద్యార్థులు తమ మేధోశక్తిని రంగరించి చక్కటి ఆలోచన చెబితే చాలు. దానిని డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ మనాక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇదే సమయంలో విద్యార్థి పేరు, పాఠశాల యూడైస్ కోడ్, రెవెన్యూ జిల్లా, విద్యార్థి బ్యాంక్ ఖాతా నంబర్ పొందుపరచాలి.

**ఎంపికైతే ప్రోత్సాహకం**

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అన్ని యాజమాన్యాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డు కోసం తమ ఆలోచనలు పంపించవచ్చు. 6 నుంచి పదో తరగతి వరకూ 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు గల వారు దీనికి అర్హులు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా స్థాయిలో నియామకమైన కమిటీ విద్యార్థులు పంపించిన అంశాలు పరిశీలించి మంచి ఆలోచనలు ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన విద్యార్థులకు వారి ఖాతాల్లో రూ.10 వేలు జమ చేస్తారు.

**విద్యార్థులకు ఎంతో ఉపయోగం**



ఇన్‌స్పైర్‌లో ప్రాతినిధ్యం వహించే విద్యార్థులకు భవిష్యత్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. జిల్లా సైన్స్ అధికారులు ఆయా జిల్లాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు ఎక్కువ మంది చేరేలా కృషి చేస్తున్నాము.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ

**ప్రతి పాఠశాలా పాల్గొనేలా..**



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాం. ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ ప్రాజెక్టు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. గత ఏడాది కంటే అధికంగా పాల్గొనేలా కృషిచేస్తున్నాము.

– ఎం.శ్రీనివాస్ వినీల్, జిల్లా సైన్స్ అధికారి, కాకినాడ

### ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం



జెండా ఊపి ఆర్మీ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఆర్మీ అధికారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని మంగళవారం కలెక్టర్ షణ్మోహన్ ఆర్మీ అధికారులతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా షణ్మోహన్ మాట్లాడుతూ ఈ ర్యాలీ ఆగస్టు 20 వరకు కొనసాగుతుందన్నారు. ఈ నియామక ర్యాలీ నిర్వహణకు అవసమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల నుంచి 10 వేల మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. తొలిరోజు సుమారు 700 మంది అభ్యర్థులు ర్యాలీలో పాల్గొన్నారు. పరుగు పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని డీఎస్ఏ లోపలికి అనుమతించి వీరికి శారీరక పరీక్షలు నిర్వహించి అర్హత సాధించిన వారికి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్ల భారం మోపొద్దు



రమణయ్యపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజావేదిక నాయకులు

కాకినాడ రూరల్: అదాని స్మార్ట్ కరెంట్ మీటర్లను ఇంటికి, దుకాణాలకు వేయవద్దని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ప్రజలపై భారాలు వేయవద్దని కోరుతూ సీపీఎం కాకినాడ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో రమణయ్యపేటలోని డి 4 సబ్ స్టేషన్ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ గౌతు రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు చింతపల్లి అజయ్ కుమార్, తొట్టిపూడి రాజా మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై నిత్యావసర వస్తువులు, సరుకుల ధరల భారం పడిందన్నారు. విద్యుత్ రంగాన్ని అదాని సంస్థకు అప్పగించాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని, స్మార్ట్ మీటర్లు ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఇంటికీ బిగించాలని చూస్తున్నారని, గతంలో లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చి ఇప్పుడు రెండు కోట్ల మీటర్లను బిగించేందుకు చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పెద్దింటిశెట్టి రామకృష్ణ, ఆత్మకూరు కృష్ణాజీ, నాగేంద్ర, చంద్రశేఖర్, అప్పలరాజు, శ్రీను, సూరిబాబు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి**

కాకినాడ సిటీ: విద్యుత్ చార్జీల భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను బిగించవద్దని డిమాండ్ చేస్తూ స్థానిక విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద ప్రజావేదిక ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా, ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు జె.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాజ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, రైతు కూలీ సంఘం నాయకులు బొచ్చా ఏసు తదితరులు మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో విద్యుత్ లేకుండా జీవనం లేదని, కాబట్టి కార్పొరేట్‌ల కన్ను విద్యుత్ రంగంపై పడిందన్నారు. దేశభక్తి గురించి ప్రగల్భాలు పలికే బీజేపీ నాయకులు అదానీ లాభాల కోసమే విద్యుత్ సంస్కరణల చట్టం చేశారని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల ఆందోళన గమనించి విద్యుత్ చార్జీల భారాలు రద్దు చేయాలని, ఇళ్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం విద్యుత్‌శాఖ కమర్షియల్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజావేదిక నాయకులు గుబ్బల ఆదినారాయణ, బంగారు సత్యనారాయణ, శ్రీపాదం సత్తిబాబు, వట్టికూటి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# 'కింగ్స్'కు మద్దతుగా రోటరీ ర్యాలీ



కాకినాడ కింగ్స్ క్రికెట్ జట్టుకు మద్దతుగా రోడ్ షో నిర్వహిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: కాకినాడ కింగ్స్ క్రికెట్ జట్టుకు రోటరీక్లబ్ తరఫున సహాయం అందిస్తామని రోటరీ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఈ సందర్భంగా జట్టుకు మద్దతగా మంగళవారం క్లబ్ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. కాకినాడ యువకుడైన కేఎస్ భరత్ టీం కెప్టెన్‌గా వ్యవహరించడం మన కాకినాడకు ఎంతో గర్వకారణమన్నారు. జట్టుకు తాము అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కెప్టెన్ భరవత్ మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా ఏపీఎల్ సీజన్ 4లో ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌కు కాకినాడ కింగ్స్ స్పాన్సర్ చేసిన యాపిల్ ఈ క్యుపిన్ సంస్థ ప్రతినిధి పి.అవినాష్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు తలాటం హరీష్, సత్యనారాయణ, రఫీ సహాయంతో నాలుగు రోజుల ప్రాక్టీస్‌కు ఎంతో సహకారం అందించారన్నారు. జట్టును ప్రోత్సహిస్తున్న ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌ను, రోటరీ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి, రోటరీ మాజీ గవర్నర్ ఎల్ సత్యనారాయణన్, రోటరీక్లబ్ కాకినాడ అధ్యక్షుడు తలాటం బుజ్జి, సభ్యులు ముమ్మిడి సత్యనారాయణ, అంకుర్ సురానాకు క్రికెట్ అభిమానులు కృతజ్ఞతలు తెలిపారు.

**కాకినాడ కింగ్స్ లోగో, జెర్సీ ఆవిష్కరణ**



కాకినాడ కింగ్స్ ఏపీఎల్ లోగోను ఆవిష్కరిస్తున్న జ్యోతుల నవీన్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక గోదావరి కళాక్షేత్రంలో కాకినాడ కింగ్స్ లోగో, జెర్సీలను జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి నవీన్ ముఖ్య అతిథిగా హాజరై వయస్సు మీరిన క్రీడాకారులకు ఐపీఎల్, ఏపీఎల్ ఒక మంచి అవకాశం అన్నారు. కాకినాడ కింగ్ ఫ్రాంచైజీ యజమానులు పుట్టా శరత్, అవినాష్, ఎల్.టిక్కూ, బన్నీ, తోట సుబ్బారావు నాయుడు, కాకినాడ కింగ్స్ కెప్టెన్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జీజీహెచ్ మిల్క్ బ్యాంక్ డైరెక్టర్ కాశీనాథ్

కాకినాడ రూరల్: తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం లభిస్తుందని జీజీహెచ్ మిల్క్ బ్యాంక్ డైరెక్టర్ కాశీనాథ్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సర్పవరంలో ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్ట్‌లో మంగళవారం సీడీపీఓ వై.లక్ష్మి అధ్యక్షతన జరిగన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లి ముర్రుపాలను బిడ్డకు ఇవ్వాలని, ఇతరుల బిడ్డలకు ఇవ్వాలనుకునే వారి కోసం మిల్క్ బ్యాంక్ అందుబాటులో ఉందన్నారు. సీడీపీఓ లక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల ద్వారా పిల్లలకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే తల్లికి సైతం రొమ్ము క్యాన్సర్, గర్భసంచి క్యాన్సర్లు రావన్నారు. కార్యక్రమంలో మిల్క్ బ్యాంక్ కో ఆర్డినేటర్ మాధవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మశ్రీ, విజయలక్ష్మి, మణి, సింహాచలం, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందనలు



ఎస్పీ బిందుమాధవ్‌ను సత్కరిస్తున్న నూతన కానిస్టేబుళ్లు

కాకినాడ క్రైం: హోంగార్డులుగా పని చేస్తూ పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన 15 మందిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మంగళవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. ఓ వైపు హోంగార్డులుగా పనిచేస్తూనే సడలని సంకల్పంతో ప్రయత్నం చేసి కానిస్టేబుల్ ఉద్యోగాలు సంపాదించడం స్ఫూర్తివంతమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లు మాట్లాడుతూ తాము ఉద్యోగాలు పొందేందుకు ఎస్పీ బిందుమాధవ్ ఎంతగానో తోడ్పడ్డారన్నారు. శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్ సహా, ప్రిపరేషన్ కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేసి తామంతా కానిస్టేబుళ్లుగా ఉద్యోగం పొందడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ సందర్భంగా వారంతా ఎస్పీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### వ్యాయామ ఉపాధ్యాయుల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పూర్ణచంద్రరావు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వ్యాయామ ఉపాధ్యాయుల సౌకర్యార్థం రూపొందించిన డైరీని డైరీని మంగళవారం ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు ఆవిష్కరించారు. వేట్లపాలెం పీడీ యార్లగడ్డ బంగార్రాజు సౌజన్యంతో ఈ డైరీని తీర్చిదిద్దారు. గాంధీ నగర్‌లోని ప్రగతి స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పూర్ణచంద్రరావు మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులకు అవసరమైన అంశాలను పొందుపరచి, రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరరావు, పీడీలు రవిరాజు, పట్టాభి, రవికుమార్ తదితరలు పాల్గొన్నారు.

### దాత ఆశయాల మేరకు సేవలు

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బంగారు చిన శోభనాద్రి సత్రం ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని సత్రంలో మంగళవారం విద్యార్థులకు ఉచిత భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఏటా సుమారు 150 మంది నిరుపేద విద్యార్థులకు ఉచితంగా భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతో పాటు వివిధ జిల్లాల విద్యార్థులకు కాకినాడలో ఉంటూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్నారన్నారు. వారికి రెండు పూటలా ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. దాత సత్రానికి ఇచ్చిన వ్యవసాయభూమి, సత్రం ఆవరణలో ఉన్న షాపుల ద్వారా వచ్చే ఆదాయంతో ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్రం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



కాకినాడ రూరల్ తహసీల్దార్‌కు వినతి ప్రతం అందజేస్తున్న జర్నలిస్టులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వాతి ప్రసాద్ పిలుపు మేరకు నిరసన అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కుమారికు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘ నేతలు సాంబశివరావు, సురేష్ మాట్లాడుతూ తక్షణమే కొత్త అక్రెడిటేషన్లు అందించాలని, ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టులపై దాడులు నివారణకు కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కర్రి ధర్మరాజు, నందిని, పరమేష్, వెంకట్, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ పాఠశాల వద్ద బైక్‌లతో యువకుల హల్‌చల్, భీతిల్లి పక్కకు తప్పకొంటున్న విద్యార్థినులు

# కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లూ.. కళ్లాలే లేనోళ్లు..!

- విద్యా సంస్థల వద్ద పేట్రేగిపోతున్న పోరంబైకులు
- ప్రమాదకర విన్యాసాలు చేస్తూ.. విద్యార్థినుల మీదకు దూసుకు వెళ్తూ..
- ఏమాత్రం పట్టించుకోని పోలీసులు

**పిఠాపురం: ఆకతాయిల ఆగడాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. కళాశాలలు, పాఠశాలల వద్ద** బైక్‌లతో విన్యాసాలు చేయడంతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో పాఠశాలలకు వచ్చే విద్యార్థినులపైకి దూసుకువస్తుండడంతో వారు హడలిపోతున్నారు. పట్టణంలో మెయిన్ రోడ్డులో జనసంచారం ఎక్కువగా ఉండే పాడా కార్యాలయం సమీపంలో ఆర్ఆర్ బీహెచ్ఆర్ వద్ద నిత్యం పాఠశాలలు ప్రారంభం, విడిచిపెట్టే సమయాల్లో బైక్‌లు హల్‌చల్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే భయమేస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టాల్సిన పోలీసులు అవగాహనా సదస్సులు అంటు హడావిడి చేయడం తప్ప ఆకతాయిల ఆగడాలు పట్టించుకోడం లేదు. ఆకతాయిలను అదుపులోకి తీసుకుని, వారి తల్లిదండ్రుల ఎదుటే ఆ పిల్లల ఘనకార్యాలను వివరించి కౌన్సెలింగ్ ఇవ్వాలని, ప్రతి కళాశాల, పాఠశాల వద్ద రహదారి స్పష్టంగా కనపడేలా సీసీ కెమెరాలు పెట్టాలని, ఆకతాయిలను నియంత్రించాలని ఆడపిల్లల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

### మున్సిపల్ స్కూల్‌కు ప్రింటర్ బహూకరణ



స్కూల్‌కు ప్రింటర్‌ను అందజేస్తున్న సత్యనారాయణ

బోట్‌క్లబ్: స్థానిక శ్రీరామ్‌నగర్ మున్సిపల్ హైస్కూల్‌కు బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ మంగళవారం తన పుట్టిన రోజు సందర్భంగా కలర్ ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య జన్మదినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, బీజేపీ సెంట్రల్ మండల ప్రధాన కార్యదర్శి జంపన రమణయ్యరాజు, నాయకులు గోడి వెంకట్ పాల్గొన్నారు.